క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

భామిని: మండలంలోని లివిరి – దిమ్మిడిజోల గ్రామాల మధ్య తంపర భూముల్లో రైతుల మధ్య రేగిన నీటి వివాదాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం పరిష్కరించారు. తహసీల్దార్ శివన్నారాయణ ఆదేశాల మేరకు ఆర్ఐ ప్రభాకర్, వీఆర్ఓ చిన్నారావు తంపర భూముల వద్దకు చేరుకుని ఇరువర్గాల రైతులతో మాట్లాడారు. వెంటనే జేసీబీ తెప్పించి నీటిని తొలగించారు. అనంతరం భారీ వర్షాల వల్ల ఏర్పడిన నష్టాలపై ఆరా తీశారు.

కాలువ గండిని పూడ్చండి


రహదారి కింద కాలువకు పడిన గండిని చూపిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస రూరల్: తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, నదులు వరదనీటితో ఉప్పొంగుతున్నాయి. దీంతో డంగభద్ర గ్రామ సమీపంలోని రహదారి వద్ద ఉన్న కాలువకు గండి కొట్టడంతో అక్కడి రోడ్డులో భారీ గుంత ఏర్పడింది. అధికారులు స్పందించి, గండిని పూడ్చాలని లేకుంటే పెద్దనష్టమే చూడాల్సి వస్తుందని సీపీఎం నాయకుడు కె.సీతారాం అన్నారు. సోమవారం ఆ గండిని పరిశీలించిన ఆయన..ప్రమాదం జరగకముందు స్పందిస్తేనే మంచిదని హితవుపలికారు. త్వరగా గండి పూడ్చే పనులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి


ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ4 మద్యం షాపులు నిర్వహించే వారంతా పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. శ్లాబ్‌లో పేర్కొన్న ప్రకారం లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన ధరకే మద్యం విక్రయించాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జియ్యమ్మవలస రూరల్: కురుపాం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగు మద్యం దుకాణాల పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు కోరారు.

కిరాణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు


వస్తువుల కాలం చెల్లిన తేదీని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని కిరాణా షాపుల్లో పోలీసులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లి పదార్థాలు, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలేమైనా విక్రయిస్తున్నారా అనేది పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిషేధించినవేవీ విక్రయించడానికి వీల్లేదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు.

● తెరిపివ్వని వాన..


సీతంపేట: సంతమల్లి - కుశిమి గ్రామాల మధ్య పొంగుతున్న గెడ్డ


పాలకొండ రూరల్: లోతట్టు పంట పొలాల్లోకి చేరిన వర్షపునీరు

రెండు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వరుణుడు శాంతించకపోవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. కొన్నిచోట్ల గండి పడే అవకాశం కూడా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే రోడ్ల మీదుగా వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు వాహన చోదకులు, బాటసారులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల ఈ వర్షాలు వరి ఉభాలకు మేలు చేయగా.. మరికొన్ని చోట్ల లోతట్టు పొలాలు ముంపునకు గురయ్యాయి.

– భామిని/సీతంపేట/వీరఘట్టం/పాలకొండ రూరల్


వీరఘట్టం: మండల కేంద్రంలో గొడుగులతో ప్రజలు


భామిని: నేరడిలో కురుస్తున్న వర్షం

పశువుల సంరక్షణపై దృష్టిసారించాలి

గుమ్మలక్ష్మీపురం: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నందున పాడిరైతులంతా అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ టి.సంధ్య సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని ప్రాంతీయ పశువైద్య శాల సహా గుమ్మ గ్రామ పశువైద్య శాల, గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి పశువైద్య శాలను ఆమె సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. పశువ్యాధులు వాటి నివారణ చర్యలపై పాడిరైతులు, పశుపోషకులను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఎక్కడైనా తుపాను వర్షాలకు పశునష్టం జరిగితే 24 గంటల్లోగా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ లేదా పశువైద్య సిబ్బందికి విషయం తెలియజేయాలని తెలిపారు. ఆమె వెంట పశువైద్యులు పి.లక్ష్మణరావు, ముని తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సంధ్య

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

పాలకొండ రూరల్: సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. డివిజన్ కేంద్రంలోని సబ్‌జైల్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ.. ఆరోగ్య పరీక్షలు చేయడానికి వైద్యులు వస్తున్నారా.. లేదా.. ఎటువంటి ఆహారం అందిస్తున్నారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. అలాగే జైలు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఖైదీలకు తాగేందుకు వేడినీరు ఇవ్వాలని జైలు సూపరింటిండెంట్ బి.జోగులును ఆదేశించారు. ఈయన వెంట హెడ్ వార్డర్ జి.రమణయ్య, తదితరులున్నారు.


సబ్ జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

మునిగి మూడు రోజులైతే ఇప్పుడా పరిశీలన?


కేసూరిగెడ్డ పరిసరాల్లో చెరువును తలపిస్తున్న పంటపొలాలు

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి కేసూరిగెడ్డ ప్రాంతంలో నీటమునిగిన పంటపొలాలను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. అనంతరం ఎవరెవరి పంటపొలాలు నీటమునిగాయన్న విషయంపై రైతులను ఆరాతీశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రావుపల్లి సహా కొత్తపల్లి, పెద్దూరు గ్రామాల్లోని పొలాలు నీటమునగగా, అయినప్పటికీ అధికారులు పరిశీలనకు రాలేదని, ఇంత ఆలస్యమా అని సదరు అధికారుల తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మునిగి మూడు రోజులైతే ఇప్పుడా పరిశీలన చేసేదని మండిపడ్డారు. ఇదిలా ఉంటే సోమవారం రైతులతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి వెళ్లిన సర్పంచ్ బి.మహేష్.. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ పంటపొలాలు నీటమునిగినా అధికారులెవరూ పరిశీలించడానికి రాలేదని, అధికారులతో నష్ట నివారణను అంచనా వేయించి పరిహారం వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.


రావుపల్లిలో పొలాలను పరిశీలించేందుకు వచ్చిన వ్యవసాయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న సర్పంచ్

రోడ్ల పునర్నిర్మాణ పనులు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని టీజీ రోడ్డు(పి.ఆమిటి జంక్షన్) నుంచి పి.ఆమిటి గ్రామం వరకు, టీజీ రోడ్డు(కళిగొట్టు జంక్షన్) నుంచి కురుపాం మండలంలోని ఉదయపురం వరకు ఉన్న బీటీ రోడ్ల పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం ప్రారంభించారు. రూ.1.20 కోట్లు పి.ఆమిటికి, రూ.1.30 కోట్లు ఉదయపురం రోడ్డు నిర్మాణానికి మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు.

పడవ ప్రయాణం నిలిపివేత

వీరఘట్టం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో వీరఘట్టం మండలం కడకెల్ల వద్ద నుంచి నడుపుతున్న పడవ ప్రయాణాలను సోమవారం అధికారులు రద్దు చేశారు. ఈ మేరకు వీఆర్ఓ రాజేంద్ర నదీతీర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

కిరాణా షాపుల్లో పోలీసుల దాడులు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం గ్రామంలో కిరాణా షాపుల్లో అమ్ముతున్న శీతల పానీయాలు, బిస్కెట్ ప్యాకెట్లు కాలం చెల్లినవిగా గుర్తించిన ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఈ నెల 16వ తేదీన తేజశ్విని అనే బాలిక కిరాణా షాపులో కూల్ డ్రింక్ తాగి అస్వస్థతకు గురి కావడంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుకాణాలపై ఆదివారం దాడిచేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు దుకాణ దారులు వారణాసి మన్మథరావు, ఎస్.ఈశ్వరరావు, టి.వెంకటరమణ, వి.చినమల్లేశ్వరరావు, ఎం.సువర్ణలపై కేసు నమోదు చేశామన్నారు.

వర్క్ ఫ్రం హోం సర్వే వేగవంతం చేయాలి

మక్కువ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే వేగవంతం చేయాలని స్థానిక పంచాయతీ కార్య నిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఇటీవల కురుస్తున్న వర్షాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ తెర్లి జగన్‌మోహనరావు

సీతానగరం: జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు, వైద్యాధికార సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎన్‌సీడీ డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. తనపర్యటనలో భాగంగా సోమవారం బూర్జలో వైద్యాధికార సిబ్బంది, పంచాయతీ సర్పంచ్ జి.దాసు ఆధ్వర్యంలో వీధుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించడానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

● పొంచి ఉన్న ప్రమాదం


అధ్వానంగా మారిన పాలకొండ – సీతంపేట రహదారి

పాలకొండ రూరల్: పాలకొండ – సీతంపేట ప్రధాన రహదారిలో ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో రోడ్డుపై ఏర్పడ్డిన గోతుల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కూడా నిత్యం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గోతుల్లో పడి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సక్రమంగా ఎరువుల వినియోగం

పాలకొండ: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు ఎరువులను సక్రమంగా వినియోగించాలని వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి సూచించారు. మండలంలోని కొండాపురంలో సోమవారం పర్యటించి, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెలకువలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు వేయడం ద్వారా రైతులకు ఖర్చు తప్ప పంటలకు ప్రయోజనం ఉండదన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేయకూడదని సూచించారు.

గణపతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం:

గణపతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎల్విన్‌పేట సీఐ బి.హరి తెలిపారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. నిర్వాహకులంతా ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తున్నారు.. ఏ గ్రామంలో చేస్తున్నారు.. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న విషయాలను పోలీసులకు తెలియజేసి, అనుమతి తీసుకోవాలని చెప్పారు. నిమజ్జనోత్సవం ఎక్కడ చేస్తున్నారన్న విషయం కూడా తెలియజేయాల్సి ఉంటుందన్నారు.


ఎల్విన్‌పేట సీఐ హరి

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను తినడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ సోమవారం ప్రారంభించి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలను విక్రయించారు. అనంతరం ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి ప్రకృతి వ్యవసాయం అవసరాన్ని క్షుణ్ణంగా వివరించారు. రైతులంతా ప్రకృతి సేద్యం వైపు మరలాలని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ కో–ఆర్డినేటర్ కిమిడి భూషణరావు తదితరులు పాల్గొన్నారు.


కూరగాయల విక్రయాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

వసతిగృహాన్ని పునఃప్రారంభించాలి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ వసతిగృహాన్ని పునఃప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీఐ వసతిగృహ విద్యార్థులతో సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే వసతిగృహాన్ని కొన్నేళ్లుగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హాస్టల్‌ను నిర్వహించని కారణంగా విద్యార్థులే వంటలు వండుకుని, చదువుకోవాల్సి వస్తోందని ఇలా అయితే పరీక్షల సమయంలో చాలా ఇబ్బంది కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే హాస్టల్‌ను పునఃప్రారంభించి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ముఖ్యంగా మూడు పూటలా నాణ్యమైన ఆహారం, సౌకర్యవంతమైన వసతి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పరామర్శ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని ఎగువ కొత్తగూడకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బి.ఈశ్వరరావు ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి సోమవారం కలిసి పరామర్శించారు. ఆయన చనిపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, నాయకుడు రేవు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఈశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

‘ఉపాధి’ బిల్లులు చెల్లించండి

జియ్యమ్మవలస రూరల్:

మండలంలోని 31 పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, ఐదు నుంచి ఆరు వారాల బిల్లులను వేతనదారులకు చెల్లించలేదు. దీంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ కూలిడబ్బులపై ఆధారపడి జీవించే జీవితాలు తమవని, ప్రభుత్వమే ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. వారం రోజుల్లోగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేకుంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామని వేతనదారులు హెచ్చరించారు.

200 బస్తాల డీఏపీ ఏమైనట్లు?

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామ రైతు సేవా కేంద్రానికి శుక్రవారం వచ్చిన 200 బస్తాల డీఏపీ ఏమైనట్లు అని సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ప్రశ్నించారు. డీఏపీ బస్తా కోసం రైతు సేవా కేంద్రానికి సోమవారం వెళ్లిన ఆయనకు అక్కడి సిబ్బంది ఒక్క బస్తా కూడా లేదని చెప్పడం ఆయనను ఆశ్చర్యానికి గురిచేసింది. శుక్రవారం ఎరువుల బస్తాలు కేంద్రానికి రాగా శుక్ర, శని, ఆదివారాలు వరుసగా సెలవులు కావడంతో ఆ బస్తాలు ఏమయ్యాయని, ఎవరికి ఇచ్చారని నిలదీశారు. ఇదే విషయమై వీఏఏని అడగ్గా ఇటీవల బదిలీ అయిన వ్యవసాయ సహాయకురాలి లాగిన్‌లోనే ఆ ఎరువుల బస్తాలు ఉన్నాయని, ఏమైందో ఆమెకే తెలియాలని సమాధానం ఇచ్చారు. అయినా దీనిపై స్పష్టతనివ్వాలని, ఉన్నతాధికారులు స్పందించి, ఎరువుల బస్తాల మాయం వెనక రహస్యాన్ని బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏబీ రోడ్డు మరీ అధ్వానం..

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు మరీ అధ్వానంగా తయారైంది. మామూలుగానే ఈ రోడ్డు మీద రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటారు. అటువంటిది వర్షాలు కురుస్తుండడంతో ఏబీ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడడంతో వాహనాలు బోల్తా పడుతున్నాయి. అలాగే నులకజోడు – బిల్లుమడ మధ్య రోడ్డు తవ్వి వదిలేయడం వల్ల ఏర్పడిన గోతులతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. నేరడి బ్యారేజ్ సమీపంలో, గురండి కూడలి వద్ద కూడా రహదారులు గోతులతో దర్శనమిస్తున్నాయి.


నులకజోడు వద్ద రహదారి దుస్థితి


భామిని మండల కేంద్రంలోని రోడ్డుపై ఏర్పడిన గుంత


నేరడి బ్యారేజ్ వద్ద భారీ గుంత